క్లుప్తంగా

వీధి కుక్క దాడిలో చిన్నారికి గాయాలు



కుక్కదాడిలో గాయపడిన చిన్నారిని చూపుతున్న తండ్రి దేవరాజు

ములకలచెరువు: వీధి కుక్క దాడిలో ఐదేళ్ల చిన్నారికి గాయాలైన సంఘటన ములకలచెరువు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. చిన్నారి తండ్రి దేవరాజు కథనం మేరకు... మండలంలోని దేవులచెరువు పంచాయతీ రాజుగారిపల్లెకు చెందిన దేవరాజు కుమారుడు ధ్రువీక్(5) వీధిలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా వీధి కుక్క ధ్రువిక్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన కుటుంబసభ్యులు కుక్క నుంచి కాపాడి తంబళ్లపల్లె పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి



సమావేశంలో పాల్గొన్న కార్మికులు

ములకలచెరువు: ఆటో, హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. స్థానిక మండల కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయక పోవడం సరికాదన్నారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అదే విధంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సలీం, వేణు, గోపాల్‌రెడ్డి, రెడ్డిమౌలాలి పాల్గొన్నారు.

కార్యకర్తల సేవలు గుర్తించండి



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న పఠాన్ ఖాదర్‌ఖాన్

మదనపల్లె: టీడీపీకి తాను అందించిన సేవలను గుర్తించి సముచిత ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్ విన్నవించారు. సంక్రాంతి పండగ సందర్భంగా నారావారిపల్లెకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం పఠాన్ ఖాదర్‌ఖాన్ మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేశానని ఆయన పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత అంద్రువారిపల్లె జట్టు



అంద్రువారిపల్లె జట్టుతో నిర్వాహకులు

కేవీపల్లె: మండలంలోని తీతవగుంటపల్లెలో జరిగిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో అంద్రువారిపల్లె జట్టు విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు రెడ్డిశేఖర్ తెలిపారు. బుధవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. విజేతకు రూ. 10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన అంద్రువారిపల్లె జూనియర్స్ జట్టుకు రూ. 7 వేలు నగదు బహుమతి అందజేశారు.

మాజీ సైనికుడికి సన్మానం



చిప్పిలి మల్లికార్జున్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మదనపల్లె: ఇండియన్ ఆర్మీ డే సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ సైనికుడు చిప్పిలి మల్లికార్జున్‌రెడ్డిని కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన కుటుంబాన్ని, ప్రాణాలను పణంగా పెట్టి దేశ సరిహద్దుల్లో సైనికులు అందించే సేవలు వెలకట్టలేనివన్నారు. ఏటా జనవరి 15న ఆర్మీ డే సందర్భంగా మాజీ సైనికులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూనస్, మహేష్, చరణ్, యాసిన్‌పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సాలేవాండ్లపల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఇటీవల స్థానికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసారు. బోరు ఉన్నా ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నీటి సమస్య తలెత్తిందని వాపోయారు. ఈ సమస్యపై స్పందించిన సర్పంచ్ శివ, కార్యదర్శి శివప్రసాద్‌నీటి సమస్య పరిష్కరించారు.

చెరువు నిండక.. చేను పండక

జిల్లాలోని దక్షిణ ప్రాంతంలో సకాలంలో వర్షాలు కురిస్తే.. పంటలు సాగుచేసేందుకు నీటి వనరులకు కొరత లేదు. 2024 ఖరీఫ్‌లో 19 మండలాల్లో కరవు ఉన్నట్లు టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర బృందం పర్యటించినా.. ఎండిన చెరువులను చూడలేదు. నష్టపోయిన పంట పొలాలను పరిశీలించలేదు. అయినప్పటికీ కరవు బృందం నిర్ణయంపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు.

- వర్షాభావంతో చెరువులకు చేరని జలం
- కొన్ని చెరువుల్లో పశువులు తాగేలా నీరు
- 68,482 ఎకరాల ఆయకట్టు బీడు



చుక్కనీరు ప్రవహించని పాపాఘ్ని నది

బి.కొత్తకోట: తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో 2,595 చెరువులు, రెండు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులున్నాయి. వాటి కింద మొత్తం 68,482.99 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. వంద ఎకరాలకు పైబడిన ఆయకట్టు కలిగిన చెరువులు(ప్రాజెక్టులతో కలుపుకుని) 81 ఉండగా, వాటి కింద 26,153.99 ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. వంద ఎకరాలలోపు ఆయకట్టు కలిగిన చెరువులు 2,516 ఉండగా, వాటికింద 42,329.08 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ప్రాజెక్టులు మినహాయిస్తే అత్యధిక ఆయకట్టు పెద్దతిప్పసముద్రం మండలంలో ఉంది. ఇక్కడి వ్యాసరాయ, రంగరాయ, తిప్పరాయ చెరువులు ఉమ్మడి చిత్తూరుజిల్లాలోనే అతిపెద్ద చెరువులు. ప్రస్తుతం ఈ చెరువుల్లో నీళ్లు ఉన్నప్పటికీ తూములు ముళ్లకంపలతో మూసుకు పోవడంతో నీటి విడుదల సాధ్యం కావడం లేదు. పెద్దేరు, బాహుదా ప్రాజెక్టుల్లో నీళ్లున్నప్పటికి డెడ్ స్టోరేజి కంటే కొద్ది ఎక్కువగా ఉండడంతో దిగువకు విడుదల చేసే అవకాశం లేదు. తంబళ్లపల్లె మండలంలోని చిన్నేరు, దబ్బలగుట్ట ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నా వాటిని ఆయకట్టుకు అందించలేని పరిస్థితి. భారీ వర్షాలు కురిసిన కొన్ని చోట్ల చెరువులకు నీళ్లు చేరినా సాగుకు సరిపడా లేవు. ఈ మూడు నియోజకవర్గాల్లో ఉన్న చెరువుల్లో 20శాతానికి లోపే నీళ్లున్నాయి. పూర్తిగా నిండిన చెరువు ఒక్కటీ లేదు.

కాలువ పారితే బోర్ల నిండా నీళ్లు

హంద్రీనీవా ప్రాజెక్టు పుంగనూరు ఉప కాలువలో 2019 నుంచి 2024 మార్చి వరకు మూడుసార్లు కృష్ణా జలాలు పారాయి. దీనితో తంబళ్లపల్లె, మదనపల్లె నియోజక వర్గాల్లో భూగర్భ జలమట్టం పెరిగింది. ఎండిపోయిన బోర్లు పని చేశాయి. పాడుబడిన బావులు నిండిపోయాయి. నీటి ప్రవాహం ఆగిన తర్వాత రెండునెలల వరకూ బోర్లు పనిచేశాయి. దీనివల్ల రైతులు పంటలు సాగు చేశారు. ఈ సీజన్‌లో కూటమి ప్రభుత్వం నీటిని నిలిపివేయడంతో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరగలేదు. దీంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. 2024 ఖరీఫ్‌లో వర్షాభావంతో కరవు ప్రకటన చేసింది టీడీపీ ప్రభుత్వం. ఈ కరవును పరిశీలించేందుకు కేంద్ర బృందం పర్యటించినా కేవలం ఫొటో ప్రదర్శన, ముఖాముఖికే పరిమితమైంది.జిల్లా వ్యాప్తంగా 19 మండలాలను కరవు ప్రాంతంగా ప్రకటిస్తే అందులో అత్యధిక మండలాలు తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోనే ఉన్నాయి.

పారని పాపాఘ్ని

కర్ణాటక నందికొండలో పుట్టి పెద్దతిప్పసముద్రం మండలంలోని టీ.సదుం, కందుకూరు గ్రామాల మీదుగా ప్రవహించే పాపాఘ్ని నది ప్రవహించి మూడేళ్లు దాటింది. ఇది ప్రవహిస్తే పది గ్రామాల్లో సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. పాపాఘ్ని నీటిని నిలువరిస్తూ దానిపై కృష్ణదేవరాయుల కాలంలో వ్యాసరాయ సముద్రం చెరువును నిర్మించారు. నది ప్రవహించినప్పుడు చెరువు నిండి సీజే ప్రాజెక్టుకు నీళ్లు చేరుతాయి.

చెరువులు, ఆయకట్టు వివరాలు (ఎకరాల్లో)

మండలం	చెరువులు	ఆయకట్టు
మదనపల్లె	207	5,160.27
నిమ్మనపల్లి	129	2,918.59
రామసముద్రం	199	2,912.84
కురబలకోట	108	2,644.53
బి.కొత్తకోట	176	3,983.12
పెద్దమండ్యం	183	2,998.95
తంబళ్లపల్లె	145	3,046.61
పెద్దతిప్పసముద్రం	113	7,370.50
ములకలచెరువు	126	3,444.45
పెద్దేరు ప్రాజెక్టు	-	4,300.00
బాహుదా ప్రాజెక్టు	-	2,880.00
వాల్మీకిపురం	149	6,327.5
గుర్రంకొండ	172	3,834.33
కేవిపల్లె	263	2,895.53
కలకడ	108	5,346.17
కలికిరి	195	6,713.59
పీలేరు	178	1,706.01

తిరుగు ప్రయాణానికి తిప్పలు



టికెట్ కోసం బారులు తీరిన ప్రజలు

రాజంపేట టౌన్ : సంక్రాంతి సందర్భంగా పరమపదించిన కుటుంబ సభ్యులకు దుస్తులు పెట్టుకునేందుకు సొంతూళ్లకు వచ్చిన బంధువులకు తిరిగి తాము నివాసం ఉండే ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలే కాక ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రజలు సంక్రాంతి పండుగ కోసం తమ స్వగ్రామాలకు పెద్దఎత్తున చేరుకున్నారు. అయితే గురువారం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, కార్యాలయాలు పనిచేయనున్న కారణంగా అనేక మంది కనుమ పండుగ రోజు నుంచే తిరుగు ప్రయాణం అవుతున్నారు. అయితే ప్రజల రద్దీకి సరిపడా బస్సులు లేకపోవడంతో రైళ్లను ఆశ్రయిస్తున్నారు. రైళ్లల్లోనూ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. దీంతో ప్రయాణికులు తత్కాల్ టికెట్ల కోసం రైల్వేస్టేషన్‌లో బుకింగ్ కౌంటర్ వద్ద బారులు తీరి కనిపించారు. ప్రభుత్వం ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రధాన ప్రాంతాలకు అదనపు సర్వీసులు నడపాలని కోరుతున్నారు.



కిక్కిరిసిన రాయచోటి బస్టాండ్

అయ్యప్ప ఆలయంలో అష్టాభిషేకం



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి



ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప భక్తులు

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ఉదయం గణపతి హోమం, అష్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో చెక్క భజనలు, కోలాటలతో స్వామి తిరువాభరణాల పెట్టెను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అయ్యప్ప మాలాధారులు ఆలయం పద్దెనిమిదిమెట్ల ద్వారా ఇరుముడులు సమర్పించారు. అయ్యప్ప శరణు ఘోషలతో సాయంత్రం మకరజ్యోతి దర్శనం కల్పించారు. అనంతరం స్వామికి బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. నక్కలదిన్నెకు చెందిన బందార్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మార్పురి సుధాకర్ నాయుడు, జర్మనీరాజు, బాలకృష్ణయాదవ్, రమణరావు, విజయలక్ష్మిభాస్కర్, బాలుస్వామి, రమణ, హేమంత్, కేశవ, రవి పాల్గొన్నారు.

ఘనంగా మాయావతి జన్మదిన వేడుక

మదనపల్లె: పట్టణంలోని టౌన్ బ్యాంక్ సర్కిల్‌లో బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఎస్పీ నాయకురాలు మాయావతి జన్మదినం ఘనంగా నిర్వహించారు. 30 అడుగుల కుమారి మాయావతి కటౌట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సహదేవ, బాలాజీ, రమణ, గంగాధర్, శీను, మహేష్, శివ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు: బీఎస్పీ పార్టీ స్థాపకురాలు మాయావతి జన్మదిన వేడుకను బుదవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహంవద్ద కేకు కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ మల్లికార్జున, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న బందెల గౌతమ్‌కుమార్

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

మదనపల్లె: మండలంలోని సీటీఎంలో మంగళవారం రాత్రి టెంపో డ్రైవర్ ఆంజనేయులుపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ప్రభుత్వ బోధనాసుపత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ ఆంజనేయులును బుధవారం ఆయన పరామర్శించారు. సాంబశివ మాట్లాడుతూ..మంగళవారం సాయంత్రం బెంగళూరుకు బాడుగ ఉందని రమ్మంటూ సీటీఎంలో నివాసం ఉంటున్న ముగ్గురు యువకులు ఆంజనేయులను పిలిచి విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారని ఆరోపించారు.



ఆంజనేయులను పరామర్శిస్తున్న సాంబశివ

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

పెద్దమండ్యం: అనారోగ్యంతో బాధపడుతూ ఓ ఉపాధ్యాయుడు బుధవారం మృతి చెందారు. వివరాలలోకి వెళితే.. చిన్నమండ్యం మండలం చాకిబండ కురవపల్లెకు చెందిన పూజారి రవీంద్ర (48) మండలంలోని బండెపురెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మధ్యాహ్నం ఇంటి వద్దే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక ఉపాధ్యాయులు తమ సంతాపాన్ని ప్రకటించారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న చొప్పా అభిషేక్‌రెడ్డి

రాజంపేట : ఏయూ క్రీడా మైదానంలో అన్నమాచార్య విశ్వవిద్యాలయ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. పోటీల్లో ఆద్యంతం రసవత్తరంగా సాగాయి. ఫైనల్‌లో అన్నమాచార్య షైకర్స్, అన్నమాచార్య నైట్స్ జట్టు తలపడగా అన్నమాచార్య నైట్స్ విజయం సాధించింది. విజేత జట్టు సభ్యుడు చంద్రశేఖర్‌కు ఏయూ ప్రో చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి ట్రోఫీతోపాటు క్రీడా ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రతి ఒక్కరిలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు పోటీలు నిర్వహిస్తూ వస్తున్నామని ఆయన పేర్కొన్నారు. క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం, ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల ద్వారా యువతకు స్ఫూర్తి అందించడమే లక్ష్యంగా ఏయూ ముందుకెళుతుందన్నారు. కార్యక్రమంలో పీడీ నాగముని, డా.కిషోర్, దినేష్‌వర్మ, సయపుల్లా తదితరులు పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

ఓబులవారిపల్లె : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలస్థాయి షటిల్ టోర్నమెంట్‌ను మంగళవారం వైఎస్సార్‌సీపీ యువ నాయకులు చిన్నిరెడ్డి అశోక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ పోటీలలో గెలుపొందిన వారికి తన సొంత నిధులతో మొదటి బహుమతి రూ.7 వేలు, ద్వితీయ బహుమతి రూ. 5 వేలు, తృతీయ బహుమతి రూ. 3 వేలుతోపాటు మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యేల పరామర్శ



శ్రీరాములురెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చింతల రామచంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి

కేవీపల్లె: మండలంలోని గోరంట్లపల్లె పంచాయతీ యర్రదొడ్డిగారిపల్లెకు చెందిన బోడెద్దుల శ్రీరాములు వారం క్రితం మృతి చెందారు. యర్రదొడ్డిగారిపల్లెలో శ్రీరాములురెడ్డి కుటుంబీకులను బుధవారం పీలేరు, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. అలాగే సొరకాయలపేట పంచాయతీ మిన్నంరెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అక్బర్ తండ్రి రహంతుల్లా మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై రహంతుల్లా మృతదేహానికి నివాళులర్పించారు. మండలంలోని గర్నిమిట్టకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ మహమ్మద్ గౌస్ తల్లి రహీమాబీ మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే గర్నిమిట్టకు చేరుకుని రహీమాబీ మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరమణారెడ్డి, యర్రమరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామకొండారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, దాబా బాబు, యల్లయ్య, నాగ పాల్గొన్నారు.

మాజీ మంత్రి, ఎంపీలకు శుభాకాంక్షల వెల్లువ



ఎంపీ మిథున్‌రెడ్డికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న నిసార్ అహ్మద్



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సదుం అయ్యప్పస్వామి ఆలయంలో మకర జ్యోతి కార్యక్రమానికి మాజీ మంత్రితోపాటు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

మదనపల్లె: రాజంపేట పార్లమెంటరీ ఎంపీ. పీ.వి. మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మదనపల్లె వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్.మగ్బూల్, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, కొత్తపల్లె మహేష్, చిప్పిలి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలకడ: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కలకడ ఎంపీపీ శ్రీదేవి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బదిలీల్లో ప్రాధాన్యత కల్పించాలని మంత్రికి వినతి

రామాపురం: జిల్లాలో ఉపాధ్యాయుల బది లీలలో ఎన్‌సీసీ వారికి అనుసరించే విధానాలను అడ్వాన్స్ ట్రెనింగ్ పూర్తి చేసిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు వర్తింపజేయాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ అన్నమయ్య జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి కోరారు. రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని రామాపురంలో బుధవారం ఆయన కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ అడ్వాన్స్ ట్రెనింగ్ పూర్తి చేసిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లను అదే స్కౌట్ విభాగంలో పోస్టు ఖాళీగా ఉన్న పాఠశాలలకు మాత్రమే బదిలీ చేయాలని విన్నవించారు. అలా సాధ్యం కానప్పుడు వారిని అదే పాఠశాలలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత బదిలీలలో ఎన్‌సీసీ వారితో పాటు సమానంగా స్కౌట్ మాస్టర్‌లకు, గైడ్‌కెప్టెన్లకు ప్రాధాన్యత కల్పించినట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ముంగిట ముగ్గులు.. పశువులకు అలంకారాలు



మదనపల్లె: సంక్రాంతి పండగ సంబరాలు



పీలేరు: ప్రత్యేక వేషధారణతో.. ఊరేగింపుగా వస్తున్న కర్ణాటక కళాకారులు



కేవీపల్లె : గ్యారంపల్లెలో పశువులకు అలంకరణ



మదనపల్లెలో పొంగళ్లు పెడుతున్న మహిళలు



గుర్రంకొండలో బెలూన్స్‌తో ఎద్దుకు అలంకరణ

మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా సంక్రాంతి, కనుమ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు .ప్రతి ఇంటి ముంగిటా రంగవల్లులు, వాటి మధ్య గోబ్బెమ్మలు ఉంచి సంప్రదాయ పద్ధతులు ఉట్టి పడేలా తీర్చిదిద్దారు. మహిళలు చెరకు గడలు కట్టి పొంగళ్లు పెట్టి పండగన నిర్వహించారు. గోమాతకు పూజలు చేశారు. కావలిపల్లెలో కర్ణాటక కళాకారుల వేషధారణ, బళ్లారి డ్రమ్స్, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉదయం ఇంటి ముందు చల్లపెట్టి గ్రామస్తులంతా మూకుమ్మడిగా తీసుకెళ్లి మంచినీటి బావులు, చెరువుల్లో వేశారు. అనంతరం పశువులను బెలూన్లు, వివిధ రకాల పూలు, తదితర సామగ్రితో అందంగా అలంకరించారు. వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించి కాటంరాజు వద్దకు తీసుకెళ్లారు. యువకులు కేరింతలు కొడుతూ పశువులను ఊరేగించారు. అనంతరం చిట్లాకుప్పకు నిప్పంటించారు. అలంకరణ, శరీర దారుఢ్యం బాగున్న పశువులకు బహుమతుల ప్రదానం చేశారు. – సాక్షి నెట్‌వర్క్

18 నుంచి జానీబాషా సాహెబ్ ఉరుసు

రాజంపేట టౌన్ : పట్టణంలోని జానీబాషాపురంలో ఈనెల 18వ తేదీ నుంచి రెండు రోజులపాటు శ్రీ జానీబాషా సాహెబ్ ఉరుసు మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ ప్రతినిధులు తెలిపారు. జానీబాషాపురంలో బుధవారం ఉరుసు పోస్టర్లను కమిటీ ప్రతినిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జానీబాషా సాహెబ్ వల్ల తమ గ్రామం ఏర్పడిందని, ఆయన పేరిట నిర్వహించే ఉరుసు ఉత్సవంలో భాగంగా 18వ తేదీ రాత్రి 8 గంటలకు షేక్ మస్తాన్ ఇంటి వద్ద నుంచి గంధం ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 19వ తేదీ రాత్రి ఉరుసు మహోత్సవం జరుగుతుందన్నారు. ఉరుసు వేడుకలో భాగంగా రాత్రి 9 గంటల నుంచి బెంగుళూరుకు చెందిన ముజమిల్ దరజ్‌చిస్టి, హైదరాబాద్‌కు చెందిన షఫియావర్షిలచే ఖవ్వాలి ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జానీబాషాపురం దర్గాకమిటీ ప్రతినిధులు బాషు, జీకే.బాషా, ఇక్బాల్, జాకీర్, జానీ, మౌలా, బాబ్జీ, మహమ్మద్, రఫీ తదితరులు పాల్గొన్నారు.